# ప్రభుత్వ భూమిలో ఏళ్లుగా ఉన్నా, పన్ను కట్టినా...

# హైకోర్టు కీలక వ్యాఖ్యలు!




**విజయవాడ, పెన్ పవర్ ఫిబ్రవరి 08**

విజయవాడలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణం కోసం తమ భూములు తీసుకున్నందుకు భూ సేకరణ చట్టం – 2013 కింద పరిహారం చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలంటూ పలువురు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ మేరకు విజయవాడ గుణదల ప్రాంతానికి చెందిన పలువురు 2020, 2022 ప్రాంతంలో రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ సందర్భంగా... ఈ భూమిలో తాము తమ పూర్వీకుల కాలం నుంచి ఉంటున్నామని తెలిపారు. దీనిపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. అవును... విజయవాడలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం తీసుకున్న తమ భూములకు పరిహారం ఇప్పించాలని.. తాము అక్కడ క్రమం తప్పకుండా ఆస్తి పన్ను చెల్లిస్తున్నామని.. విద్యుత్ కనెక్షన్ తో పాటు మున్సిపల్ వాటర్ కనెక్షన్ కూడా ఉన్నాయని.. తాము భూమి లేని పేదలమని, ఇక్కడే చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నామని.. తమ భూములు తీసుకున్నందుకు పరిహారం చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని.. తమకు న్యాయం చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. దీనిపై రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు కౌంటర్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా.. పిటిషనర్లు ప్రభుత్వ భూమిని ఆక్రమించారని.. రెవెన్యూ రికార్డుల ప్రకారం అక్కడ శ్మశానవాటిక, కాలువ ఉన్నాయని తెలిపారు. ఇదే సమయంలో... పన్నులు చెల్లించినంత మాత్రాన్న వారికి హక్కులు రావని.. వారే ఆ భూములకు యజమానులు అనేందుకు వారి వద్ద ఎలాంటి డాక్యుమెంట్లూ లేవని.. అయినప్పటికీ మానవీయ కోణంలో వారికి 114 ఇళ్లు కేటాయించామని చెబుతూ.. వారు పరిహారం పొందేందుకు అనర్హులని తెలిపారు. ఈ సమయంలో.. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్... భూ యజమానులు, ప్రభావిత కుటుంబాలకు సముచిత పరిహారం అందించడానికి భూసేకరణ చట్టం – 2013ని తీసుకొచ్చారని.. భూమి కోల్పోయినవారు నిరాశ్రయులవ్వకుండా వారి స్థితిగతులను మెరుగుపరచాలన్నది ఆ చట్టం ఉద్దేశ్యమే తప్ప.. అది ఆక్రమదారుల ప్రయోజనాల కోసం తెచ్చింది కాదని.. చట్టబద్ధ యజమానులు మాత్రమే ఈ చట్ట ప్రయోజనాలకు అర్హులని అన్నారు. ఇదే సమయంలో... ప్రభుత్వ భూమి దశాబ్దాలుగా అనుభవంలో ఉన్నప్పటికీ దానిని ఆక్రమించినవారు ఆక్రమణదారులే అవుతారు తప్ప చట్టబద్ధమైన యాజమాన్య హక్కులున్నవారితో సమానంగా పరిహారం కోరజాలరని తేల్చి చెప్పారు. ఈ సందర్భంగా పిటిషనర్లు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేశారు!

## శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా 'కార్డెన్ సెర్చ్'



**తాళ్లూరు, పెన్ పవర్ ఫిబ్రవరి 08:** శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ శ్రీ వి.హర్షవర్ధన్ రాజు, దర్శి డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం తాళ్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని తూర్పు గంగవరం, పాములవారి కాలనీలో కార్డెన్ సెర్చ్‌ను నిర్వహించారు. ఈ సెర్చ్‌లో దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, దర్శి సీఐ వై.రామారావు, తాళ్లూరు, కురిచేడు, దొనకొండ ఎస్సైలు మల్లికార్జున, శివకుమార్, త్యాగరాజుతో పాటు 35 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఫింగర్ ప్రింట్స్ ఐడెంటిఫికేషన్ డివైస్ ద్వారా అనుమానితులపై నిఘా పెట్టారు. పాముల కాలనీలోని అన్ని ఇళ్లలో తనిఖీలు చేశారు. సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 44 బైకులు, 2 ఆటోలు గుర్తించి, వాటి యజమానులకు చలానాలు విధించారు.

# బండలతో భయం భయం

### గ్రానైట్ రాళ్ల తరలింపులో ఎడతెగని నిర్లక్ష్యం

### కనీస జాగ్రత్తలు పాటించని రవాణా దారులు

### ఒంగోలు-కర్నూలు రహదారిలో రవాణా ఇలా...



**ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 08**

మర్రిచెట్లపాలెం-యల్లయ్య నగర్ రహదారిలో గ్రానైట్ తరలిస్తున్న టిప్పరు మితిమీరిన వేగంతో దూసుకొచ్చి ఆటోను ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న ఒకరు మృతిచెందగా, మిగిలినవారు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. కనిగిరి మండలం శంకవరం క్వారీ నుంచి గ్రానైట్ బండలను తరలిస్తున్న లారీ పునుగోడు సమీపంలో అదే మార్గంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి ఓవర్‌టేక్ చేసే క్రమంలో లారీ కింద పడి మృత్యువాత పడ్డారు. జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలు, విదేశాలకు గ్రానైట్‌ను ఎగుమతి చేసేటప్పుడు కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. క్వారీల నుంచి వీటిని తరలించేటప్పుడు వాహనాలు ఢీకొనడం, బండలు జారిపడడంతో ప్రజలు మృత్యువాత పడుతున్నారు. వీటిని నియంత్రించేవారు లేకపోవడంతో ప్రమాదాలకు అడ్డుకట్ట పడడం లేదు. క్వారీ నుంచి గ్రానైట్ రాళ్లను స్లాబులుగా మార్చేందుకు పాలిష్ యూనిట్లకు తరలిస్తారు. కొన్నింటిని నేరుగా చెన్నై పోర్టు ద్వారా విదేశాలకు వెళ్తుంటాయి. బండలు తరలించేటప్పుడు అవి ఎప్పుడు మీద పడతాయోనని రహదారిపై ప్రయాణించే వాహనచోదకులు, పాదచారులు బిక్కు బిక్కుమంటున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని చీమకుర్తి, సంతనూతలపాడు, బల్లికురవ, అద్దంకి, కనిగిరి ప్రాంతాల్లో జరుగుతున్న ప్రమాదాల్లో ఎంతోమంది బలవుతున్నారు. అనుమతులు తీసుకోకపోవడం, అనధికారికంగా అక్రమ రవాణా చేసే క్రమంలో ఎక్కడ దొరికపోతామోనని వాహన చోదకుల దృష్టి దానిపైనే కేంద్రీకరించడం, సామర్థ్యానికి మించి సరకును తరలించడం, అనుభవజ్ఞులైన వాహనచోదకులు లేకపోవడం రహదారి ప్రమాదాలకు కారణాలుగా కనిపిస్తున్నాయి. చీమకుర్తి క్వారీల నుంచి గ్రోత్ సెంటరులో పాలిష్ యూనిట్లకు బండలు తరలించాలంటే ఒంగోలు- కర్నూలు రహదారి మీదుగా ఒంగోలు వచ్చి వెళ్లవచ్చు. ఎవరికంట పడకూడదనే ఉద్దేశంతో చీమకుర్తి, బండ్లమూడి, దొడ్డవరం మీదుగా వెల్లం పల్లికి వస్తున్నారు. ఈక్రమంలో వెల్లంపల్లి వద్ద లారీలతో ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి.

**ఇరుకు దారులతో ప్రాణాలు బలి**

కనిగిరి ప్రాంతంలో శంఖవరం నుంచి కంభం మీదుగా రాయలసీమ జిల్లాలకు గ్రానైట్ బండలు తరలించే క్రమంలో లారీ వెనుక వెళ్లేవారు భయంభయంగా ప్రయాణిస్తున్నారు. అసలే ఇరుకు మార్గం, రహదారి సరిగా లేకపోవడంతో వాహనాలను అధిగమించే క్రమంలో మృత్యువాత పడుతున్నారు. గతేడాది జరిగిన ప్రమాదాల్లో ముగ్గురు చనిపోయారంటే ప్రమాద తీవ్రత ఎలా ఉందో తెలుసుకోవచ్చు. క్వారీలు ఎక్కువగా ఉన్న అద్దంకి నియోజకవర్గం మల్లాయపాలెం-బల్లికురవ రహదారి అధ్వానంగా ఉండడంతో బండలు జారిపడడం నిత్యకృత్యంగా మారింది. రహదారిపై బండలు జారిపడడంతో వాటిని ఢీకొని ఎంతోమంది ప్రమాదాల బారిన పడ్డారు. బల్లికురవ నుంచి అద్దంకి, మార్టూరు వచ్చే మార్గాల్లోనూ బండల రవాణాతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి.

**ఒంగోలు-కర్నూలు రోడ్డులో సాహసమే...:** క్వారీలు ఎక్కువగా ఉన్న చీమకుర్తి నుంచి బండరాళ్లను ఒంగోలు-కర్నూలు రహదారి మీదుగా చెన్నై పోర్టుకు తరలిస్తుంటారు. రద్దీగా ఉండే సాయంత్రం 6 గంటల సమయంలోనూ తరలిస్తుండడంతో వెనుక వచ్చేవారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. లారీ ఒరిగినా బండలు జారిపడకుండా జాగ్రత్తలు తీసుకోవడం లేదు. కనీసం రద్దీగా ఉండే సమయంలోనైనా ఆపితే బాగుండేది. కాని 'మమ్మల్ని ఎవరు ఆపేది అన్నట్లు..' మితిమీరిన వేగంతో దూసుకెళ్తున్నారు. స్థానికంగా రవాణా చేసేటప్పుడు బండరాళ్లు జారి పడకుండా టిప్పర్ వెనుక భాగం మూయడం లేదు. ఎక్కడ వచ్చి దొర్లిపడతాయోనని వెనుక వచ్చేవారు భయాందోళన చెందుతున్నారు. ఒంగోలు-కర్నూలు రహదారిలో వారానికొక ప్రమాదం జరుగుతున్నా గ్రానైట్ రవాణాదారుల విషయంలో పోలీసులు ఏమాత్రం పట్టనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం.

## టి ఎన్ యు ఎఫ్ ఆధ్వర్యంలో గ్రూప్2 విజేతలకు ఘన సత్కారం



**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ ఫిబ్రవరి 08**

ప్రభుత్వ ఉద్యోగం సాధించామని ఏమాత్రం విశ్రమించకుండా పట్టుదలతో కృషిచేస్తే జీవితంలో అనుకున్న లక్ష్యాలు సాధించవచ్చని ఒంగోలు నగర మునిసిపల్ కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక శ్రీ హర్షిని డిగ్రీ కళాశాలలో గ్రూప్ 2 విజేతలకు తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం వారి ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. జీవితంలో ఎన్నో కష్టనష్టాలు ఎదురవుతాయని వాటిని ఎదుర్కొని కష్టపడి ప్రిపేర్ అయితే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని ఆయన తెలిపారు. గ్రూప్ 2 విజేతలగా నిలిచిన మోతుకూరి రవీంద్రబాబు, రావూరి సుబ్బారావు ఎంతోమంది యువతకు ఆదర్శం అని, ఎన్నో కష్టాలను ఎదుర్కొని ఆయన నేడు మునిసిపల్ కమిషనర్, ఏ ఎస్ ఓ గా ఎంపిక అయ్యారని ఆయన అభినందించారు. మరొక అతిథి పిడిసిసి బ్యాంక్ పర్సన్ ఇంచార్జ్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ మోతుకూరి రవీంద్రబాబు తనకి చిన్నప్పటినుంచి తెలుసని అతనికి చాలా కష్టపడే స్వభావం ఉందని, టీచరుగా ఉంటూ ఇలాంటి ఉన్నతమైన ఉద్యోగం సాధించటం గొప్ప విషయం అని ఆయన తెలిపారు. అలాగే రావూరి సుబ్బారావు ని అభినందించారు. గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ మోతుకూరి రవీంద్రబాబు గారి మెమొరీ అద్భుతం అని రావూరి సుబ్బారావు ఇద్దరూ కూడా తను చూసిన వారిలో ఉన్నతమైన జ్ఞాన సంపద కలిగిన వారిని వారి కష్టంతో మంచి ఉద్యోగ రూపంలో లభించిందని ఆయన తెలిపారు. తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు మన్నం శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం ఏర్పాటులో మోతుకూరి రవీంద్ర తోడ్పాటు మరవరానిదని అలాగే ఉపాధ్యాయ సంఘం లో ఆయన చేసిన సేవలు మేము ఎప్పటికీ మర్చిపోమని కమిషనర్ లాంటి పోస్ట్ సాధించటం మా అందరికీ చాలా ఆనందంగా ఉందని తెలిపారు. మునిసిపల్ కమిషనర్ పోస్ట్ కు ఎంపికైన మోతుకూరు రవీంద్ర బాబు మాట్లాడుతూ తన తో పాటు, కుటుంబ సభ్యులు, స్నేహితుల తోడ్పాటు మర్చిపోలేని అందరి సహాయ సహకార వాళ్ల వల్లే నేను ఈరోజు ఈ ఉన్నతమైన స్థానంలో ఉన్నానని ఆయన తెలిపారు. అనేక అనారోగ్య సమస్యలతో తన కుటుంబ సభ్యులు బాధపడుతున్న అన్ని దిగమిందుకొని నేను విజయం సాధించాను అని మరొక గ్రూప్ టు విజేత రావూరి సుబ్బారావు తెలిపారు. కార్యక్రమానికి యనమల ఆంజనేయులు అధ్యక్షత వహించగా మిగిలిన ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు స్నేహితులు బంధువులు పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ పుట్టినరోజు వేడుకలు



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఫిబ్రవరి 8**

ప్రకాశం జిల్లా టిడిపి అధ్యక్షులు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పుట్టినరోజు వేడుకలు మండల కేంద్రంలోని సి ఎస్ పురం లో మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్ అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొని కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బొబ్బూరి రమేష్ పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నాయకత్వంలో కనిగిరి నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, రోడ్ల అభివృద్ధి, తాగునీటి సమస్యల పరిష్కారం, విద్యా-ఆరోగ్య రంగాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. రైతులు, మహిళలు, యువత సంక్షేమానికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్న నాయకుడిగా అభివృద్ధి దాత ఉగ్ర నరసింహారెడ్డి అని కొనియాడారు. మండలంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరవేయడమే లక్ష్యంగా టిడిపి పనిచేస్తుందన్నారు రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, టిడిపి సీనియర్ నాయకులు మన్నేపల్లి శ్రీనివాసులు, యన్ సి మాలకొండయ్య, సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి, సర్పంచ్ శ్రీరామ్ పద్మావతి, ఉప సర్పంచ్ పాములపాటి నరసయ్య, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు కూటగుళ్ల మహబూబ్ బాషా, రేనాటి వెంకటేశ్వర్లు, బత్తుల వెంకటాద్రి, పులి రాజశేఖర్ టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్ ఇల్లు దగ్ధం

### పదివేలు ఆర్థిక సాయం ప్రకటించిన జడ్పిటిసి వెన్నా ఇందిరా



**తర్లుపాడు పెన్ పవర్ ఫిబ్రవరి 8**

మార్కాపురం జిల్లా తర్లుపాడు మండలం కెతగుడిపి గ్రామంలో గురువారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో వెలుగు రమణ నివాస గృహం పూర్తిగా దగ్ధమై సుమారు రూ. రెండు లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ సంఘటన తర్లుపాడు జడ్పిటిసి వెన్నా ఇందిరా దృష్టికి స్థానికులు తీసుకువెళ్లారు. ఈ సంఘటనపై దృక్పథంతో స్పందించిన ఆమె కుటుంబానికి అండగా తన వంతు పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంట్లోని గృహోపకరణాలు, దుస్తులు, నిత్యావసర సరుకులు మంటల్లో కాలిపోవడం బాధాకరమన్నారు. ఇలాంటి విపత్తుల సమయంలో బాధితులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి మరింత సహాయం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

# తిరుమల ప్రసాదంపై విషప్రచారం ఆపాలి

### డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్



**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్, ఫిబ్రవరి 8**

తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి. అశోక్ కుమార్ తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. కేవలం రాజకీయ లబ్ధి కోసమే పవిత్రమైన లడ్డూపై ప్రభుత్వం విషప్రచారం చేస్తోందని మండిపడ్డారు. కోట్లాది మంది భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో భావించే ప్రసాదంపై తప్పుడు ఆరోపణలు చేయడం ద్వారా హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ?ప్రభుత్వం తన పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి, ప్రజల దృష్టిని మళ్లించడానికి ఇలాంటి అసత్యాలను తెరపైకి తెచ్చిందని విమర్శించారు. తిరుమల వంటి పుణ్యక్షేత్రాన్ని రాజకీయాల్లోకి లాగడం వల్ల కలిగే నష్టం భవిష్యత్తులో తీవ్రంగా ఉంటుందని ఆయన హెచ్చరించారు.

**మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారు**

రాష్ట్రంలో కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని, ఇది సమాజానికి ఏమాత్రం శ్రేయస్కరం కాదని అన్నారు. శ్రీవారి లడ్డూ అంటే భక్తులకు ఒక నమ్మకమని, అటువంటి పవిత్రమైన విషయాన్ని వివాదాల్లోకి నెట్టి భక్తుల్లో లేనిపోని అనుమానాలు రేకెత్తించడం అత్యంత దుర్మార్గమైన చర్య అని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని అశోక్ కుమార్ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలు పాల్గొన్నారు.

